# మొదటిదాడి

"నువ్వింత పిరికిపంద వైపోతా వనుకో లేదు నే నెప్పుడూను"

"......."

"సిగ్గు లేదూ!"

"ఆ దెలా వుంటుందో యెరుగుదువా నువ్వు?"

"మాటలు నేర్చావు"

"......"

"స్కూలు ఫైనల్లో తప్పిపోయినప్పుడు చదువు మానేస్తే నా కీయేడుపు లేకపోవును. బి.ఏ. అనిపించుకునీ కూడా యింత అమ్మమ్మ వైపోయినందుకు నేను విచారిస్తున్నాను"

"క్షమించు"

"ఆమాట తీసెయ్యి నాదగ్గిర.... నిన్నేం చేసినా నాకసి తీరదు"

"....."

"జోన్ ఆఫ్ ఆర్కు లాగా, మిస్ నైటింగేలు లాగా జీవితం సఫలపరుచుకోవాలని ఉవిళ్లూరే దానవు. "మళ్లీ పెళ్లో అంటూ యేదుస్తా" వని నన్ను కోసుకు తినేసీదానవు. ఇప్పు డీ వాలకం యేమిటీ?"

"......"

"పెళ్లిమీదికి పోతోందా యేమిటి చూపు?"

"ఈవయస్సులో ఆకోరిక పుట్టడం తప్పా?"

"ఛీ! బుద్ధి లేని పీనుగా!.... మళ్లీ మొగాడి చేతికి జు ట్టందిస్తావుటే?"

"మొగాళ్లు నాకు చేసిన అపకారం యేమిటీ?"

"వెధవముండని చెయ్యలేదూ?"

"తరవాత ఆచేత్తోటే బి. ఏ. దాకా చదువు చెప్పించలేదూ?"

"వెధవరికం తప్పిందా?"

"పెళ్లి కాని మా మూడో చెల్లికీ నాకూ భేదం యేమిటీ?"

"దాని కుండే గౌరవం నీ కెందుకు వస్తుందీ?"

"......"

"కోరచూపులు చూస్తే నా కేం భయ మనుకున్నావా?"

"బి.ఏ. అయినవాళ్ల కందరికీ ఆత్మగౌరవం అంటే యేమిటో తెలుస్తుందని. తప్పకుండా వుంటుందనీ అనుకుంటున్నాను నేను. నా వూహ తప్పే"

"పెద్ద పెద్ద మాటలు విడిచిపెడుతున్నావు"

"ఆవిషయంలో నీతో నాకు పేచీ లేదు"

"అబ్బీ....."

"......"

"చివరి కే మంటావూ? మాత నిన్నూ నన్నూ పిలుస్తోంది"

"వినపడుతోంది - కొంచెం - కొంచెం"

"కొంచెం కొంచెమా?"

"అవును. అంతే"

"హృదయం అంటూ వుంటే ఆ కొంచెమే చాలు"

"....."

"మరి రావేం?"

"......"

"మాట్టాడ వేమే?"

"....."

"ని న్నే మనాలో నాకు తోచడం లేదు"

"వూరుకోరాదూ?"

"నిన్ను విడిచిపెడతా ననుకున్నావు కామోసు పాపం"

"....."

"జెయి లంటే భయమా?"

"జెయిలుకి వెళ్లడమే ప్రధానమా?"

"అది దేశాభిమానానికి యేకమాత్ర మైన గుర్తు"

"రాజకీయంలో దిగితే అంతే కావచ్చు"

"ఇప్పుడు రాజకీయం తప్ప మరో సమస్యే లేదు మనకి"

"నే నలా అనుకోడం లేదు"

"ను వ్వెంతటిదానవు? నీ లెక్కేమిటి? నీ అభిప్రాయానికి విలవ కూడానా?"

"....."

"మహా మహా వాళ్లంతా యీ ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్నారు. నీ తాహ తెంత నీ హయా మెంత?"

"నీ ధోరణే నీదీ, అలాగే నా రుచే నాదీ అనుకోరాదూ?"

"నీకు రుచంటూ కూడా వొక టేడిసిందా?"

"......"

"ఇక నేను నింపాదిగా మాట్టాడలేను. వస్తావా రావా? అగ్నిహోత్రంలో వురుకుతావా, వురకవా?"

"నే నరికే అగ్నిహోత్రం వేరు"

"పొయిదగ్గిర పడి యేడవడమూ. పశువులాగ పిల్లల్ని–"

"నోరు సమాళించుకో నువ్వెవరితో మాట్లాడుతున్నావో తెలిసే–"

"ఇప్పటికి వస్తోంది కామోసు పౌరుషం"

"వొక మూల మొగాళ్లని తిడుతూ మళ్లీ పౌరుషమో అంటూ యేడుస్తావేం?"

"......."

"......"

"నీతో మాట్టాడడం తప్పే నాదీ"

"తరవాతి మాట కూడా అనేసెయ్యి"

"అసలు నీమొగం చూడ్డమే మొదటి తప్పు"

పళ్లు కొరుకుతూ యిలా అని సుభద్ర తారాజువ్వలాగ లేచింది. చీడీలు దిగేటప్పుడు రంగూన్ స్లిప్పర్లు బెసికిపోగా తూలి ముందుకి పడ్డంత అవస్థ అయింది. కాని ఆమె చాలా ప్రయత్నంమీద ఆపుకొని కోపానికి వుడుకుమోత్తనం జోడించగా తోకతొక్కిన ఆడతాచులాగ రోజుకుంటూ చక్కాపోయింది.

## 2

జానకమ్మ సాయంత్రం ఆరు గంటల వేళ డాబామీద పచారు చేస్తూ, అప్పుడే తల అంటుకొని వుండడంవల్ల యింకా తడిగానే వున్న జుట్టు ఆరవేసుకుంటూ "ఏమిటీ చెయ్యడం?" అని ఆలోచించుకుంటూ వుండగా సుభద్ర వచ్చి, యిలాగ తర్జనభర్జన చేసి, మనస్సు కలిచేసి వెళ్లిపోయింది.

కానైతే జానకమ్మ చాలా గంభీరురాలే; అయినా పక్కా పావు గంట దాకా ఆమె మనస్సు స్థిమితపడలేదు. ఈలోపుగా చీకటి పడింధి. దీపం లేదు. పైగా తల్లి రెండు మూడు మాట్లు పిలిచింది: కాని ఆమె యివ్వేమీ గమనించలేదు. "ఏమిటి చెయ్యడం?" ఇది వొక్కటే ఆమెకి ఆలోచన.

ఇప్పుడు రాజకీయంలో పని చేసే వారికి గల పలుకుబడి ఆమెకి తెలుసు. పైగా పింతండ్రి కూతురైన సుభద్ర మూడు మాసాల శిక్ష కూడా అనుభవించి రావడంవల్ల స్వర్గంలోనుంచి దిగివచ్చిన దేవకన్యలాగ ఎక్కడికి వెళ్లినా చాలా గౌరవం పొందుతోంది. చివరికి వాలంటీర్లు గూడా మహారధికులుగానే చెలామణీ అయిపోతున్నారు. రాజకీయంలోకి దిగితే తనకిగూడా అలాగే అసాధారణాలైన ఆదరగౌరవాలు లభిస్తాయి; కాని యీస్థితిలో కేవలం రాజకీయ ప్రచారంవల్ల జాతికీ దేశానికీ మోక్షం కలుగుతుందని ఆమెకి నమ్మకం లేదు. ఎన్నో వర్ణాలు, వొక్కొక్క వర్ణంలో యెన్నో శాఖలు, మళ్లీ ఆవొక్కొక్క శాఖలో యెన్నెన్నో తెగలు – వాటిలో కాలం యీడ్చుకొని పోయినట్లల్లా పోయే వాళ్లు కొందరు. సనాతన ధర్మవాదులు

కొందరు, సంస్కార పరాయణులు కొందరు. వారిలో బ్రహ్మ సామాజికులు, ఆర్యసామాజికులు- హైందవుని నెత్తిమీద ఎన్ని వెంట్రుకలో హైందవులలో అన్ని భేదాలు, అన్ని స్వార్థదృష్టులు-ఇలాంటి స్థితిలో సంఘపునిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసి రాజకీయంలో తాండవం చెయ్యడంలో ఆమెకి సబబేమీ కనపడలేదు, ఆమెకి మొదణ్ణుంచీ సంఘసంస్కారం అంటే అభిమానం. ఆంగ్లవాఙ్మయ పరిచయమూ, కాలేజీలో పాశ్చాత్య స్త్రీలతోటీ, కన్యలతోటీ కలిగిన సాహచర్యము. ఆమె రుచిని హెచ్చు చేశాయి. పైగా తొమ్మిదో యేట వితంతు వయిపోయి నిర్భాగ్యురాలుగాతలంప బడుతూ వుండడం కూడా ఆమెకీ దృష్టిని బలపరిచింది.

ఈదృష్టే ఆమెని ఉద్యోగం కోసం కూడా ఆశపడనివ్వలేదు. "మళ్లీ పెళ్లి చేసుకోడమో మానడమో యే మేనా నిశ్చయించుకున్నావా" అని తల్లి యే డెనిమిదిమా ట్లడిగింది; కాని యీ దృష్టివల్లనే జానకి "అప్పుడే తొందరేం?" అంటూ కాలం గడుపుకొని వస్తోంది.

అయితే సంఘసంస్కారంలో యెందుకు ప్రవేశించకూడదూ అంటే యేమిటి చెయ్యడం? "సంఘం అంతా వొక్క మోస్తరుగానే యెగుడు దిగుడుగా వుంది. ఎక్కడా హెచ్చుతగ్గులు లేవు. వొక దారీ తెన్నూ లేదు. ఇందులో యెక్కడ దిద్దుబాటు మొదలు పెడితే, యెక్కువ పని జరుగుతుందీ?" ఇదీ ఆమెకి ప్రశ్న, వొక్క సంవత్సరం నుంచీ-అంటే బి.ఏ. అయినప్పణ్ణుంచీ ఆలోచిస్తూనే వుంది; కాని ఆమె కేమీ పాలిపోలేదు. ఆమె గంటలకొద్దీ యోచిస్తుంది. ఎన్నో ప్రణాళికలు పన్నుతుంది. ఎంతో వోపికతో కష్టసుఖాలు బేరీజు వేస్తుంది. మేలులో కీడెంచుతుంది. కీడులో మే లెంచుతుంది; కాని చివరికి "యిదీ పని. ఇదీ దారి" అని తేలదు. చేసిన యోచనా. పన్నిన కల్పనా – అన్నీ చిందర వందర అయిపోతాయి.

రోజూ రోజూ ఆమె కిదే అనుభవం.

దీనిమీద ఆమె యిలా నిశ్చయం చేసుకుంది.

"నాకు ఈశ్వరప్రేరణ అయింది; కాని యింకా తపస్సు చాలదు. నిశ్చయజ్ఞానం కలగడాని కింకా మననం చెయ్యాలి. ఈశ్వరప్రేరణ స్ఫుటంగా అయిం దంటే యీ సంకల్పా వికల్పా లుండవు ఈ సాధ్యాసాధ్య విచారమూ, యీ కర్తవ్యా కర్తవ్య సందేహాలూ వుండవు. ఆస్థితి వచ్చినదంటే ముందుకి వురకడం తప్ప మరేమీ వుండదు. వాళ్లని వాళ్లని చూసి "అయ్యో! ముందుకి వెళ్లిపోతూన్నారే' అని కంగారుపడితే లాభం లేదు"

ఇప్పుడు కూడా ఆమె సరిగా "యేమిటీ చెయ్యడం?" అని మననం చేసుకుంటూవుండగా "జానీ!" అంటూ వొక యువకుడు పైకి వచ్చాడు. చేతిలో హరీకేన్‌లాంతరుంది. మొగమ్మీద ఆత్రం తొణికిసలాడిపోతుంది.

"ఎందుకురా బావా?"

"ఇప్పుడు నీవంతు వచ్చింది. వున్న పాళంగా నువ్వు లేచి రావాలి"

"ఇదిగో సిద్ధం"

"దబ్బన్న మామగారి సుందరికి పెళ్లి"

"ఎవరూ చెప్పుకోలేదే?"

"అంతా రహస్యం-"

"పెళ్లికొడు కెవరు?"

"వేంకట సోమయాజులు తాత"

"ఏమిటీ?"

"దబ్బన్న మామ యాజులు తాతకి రెండువేలివ్వాలి. తాత ఆ నోటిచ్చేశా దని పుఖారు"

"సుందరిని అమ్మే డన్నమాట"

"అక్షరాలానూ, కాని లచ్చమ్మత్త కిది సుతరామూ యిష్టం లేదు. కూతుళ్ళు కూడా వొప్పుకోలేదు. సుందరి కంటికీ మంటికీ యేకధారగా యేడుస్తోందిట. కాని కొడుకులు చిన్నవాళ్లు కావడంచేత నిలవతీసి అడిగేవాళ్ళు లేక దబ్బన్నమామ బండకెత్తాడు."

"పెళ్ళి యెక్కడా?"

"మనవూళ్ళోనే - గుళ్ళో - అదిగో బాజాలు వినపడ్డం లేదూ?"

"........"

"అరగంటలో మూడు ముళ్ళూపడిపోతాయి"

"అయితే పద. మూడు ముళ్ళూ పడిపోతాయేం? అబ్బా! ఏం లోకువగా వుందీ ఆడాళ్ళ బతుకూ? ఈరోజుల్లో కూడా యింకా నరమాంసవిక్రయ మేనా? అందులోనూ షష్టిపూర్తి అయినవాడికా?...."

"ను వ్విక్కడ ఆవేశం పొంది కూచుంటే-"

"ఇదిగో మేడ దిగేశాను"

ముందు జానకీ లాంతురక్కడ వుంచేసి తరవాత యువకుడూ మేఘాల మీద యెగిరిపోయాడు.

## 3

"దబ్బన్నా! నువ్వు "బహూ వుత్తమ" మైన షువంటి కర్మ చేశావు. మన అగ్రహారంలో యాజులికి వున్నంత కర్మశ్రద్ధ యిం కెవ్వరికీ లేదు. నువ్వు అతగాడికి సంభవించిన ఆయొక్క యిది వుందే లోటు? అది తీర్చేశావు. "దశ పూర్వేషాం దశాపరేషాం" అన్న సంకల్పం నీవిషయంలో అర్థవత్తు అయింది"

"ఇంకా సందేహమా? వయస్సు తక్కు వయినా దబ్బన్న చాలా దీర్ఘాలోచన చేశాడు. "కర్తాకారయితా" కదూ? యాజులు అగ్నిహోత్రాలు నిలిపిన దబ్బన్నకి

అశ్వమేథయాగఫలం లభించడానికి యత్కించి త్తయినా అభ్యంతరం వుందిషోయి చయనులూ?"

"నింపాదిగా పృచ్ఛ చేస్తున్నావా నువ్వు? అసలు వాడి తాత సర్వతోముఖం చేసినవాడు కాదుషోయ్! ఆ ఫలం యావద్విష్టమూ వంశం పొడుగునా కనబడక యే మయిపోతుం దనుకున్నా వోయ్?"

"పైగా యాజులు లకారం సమీపిస్తూ వున్న వాడు; గాని "లాకాయి లూకాయిగాడు" కాడు. ఇహమూ, పరమూ గూడా - ఏ మంఛావు రా రామశాస్త్రీ?"

"తమరు సెల విచ్చింది అక్షరాలా - విన్నారూ? వేదమూర్తులు అన్యధా సెలవిస్తారా మహానుభావా!"

"పైగా పిల్లా పీచూ - ఆ వొక్క వితంతుపుత్రికా నున్ను సంసారం అంతా చక్కబెడుతూ వుంటే నూత్నవధువుతో యాజులు - ఏం లోటయ్యా సుబ్బావధానీ?"

"చిత్తం, చిత్తం. ఆవొక్క వితంతుపుత్రికా గూడా నలభై దాటింది కనక దబ్బున్న కూతుర్ని - చిత్తగించారూ? చిలకని తయారుచేసినట్లు - మహా బాగా వుంది కాదూ అంతానూ?"

"అయ్యా! చయనులుగారూ! అవధానులుగారూ! శాస్త్రులుగారూ! సుముహూర్తం సమీపిస్తోందంచున్నారు సిద్ధాంతిగారు, సెల వయితే-"

"అడగాలా మమ్మల్నీ? ఏదీ తెర బాగా పట్టుకున్నారూ! మరి కానియ్యి దీక్షితులూ!"

జానకమ్మా, యువకుడూ వెళ్ళాటప్పటికి స్థితి యిలా వుంది. పెళ్ళికూతురు బుట్టలో కూచుని కుమిలిపోతూనే వుంది. లచ్చమ్మకూడా మధ్యమధ్య కళ్లు తుడుచుకుంటోంది. తతిమ్మా స్త్రీలు కూడా యే మంత వుత్సాహంగా లేరు. పెద్దలంతా పొగుడుతూ వున్నా: దబ్బున్న కూడా కత్తి వేస్తే రక్తం లేకుండా కన్నంలో పట్టుబడ్డ దొంగలాగ ధైర్యం చేసి మొగమెత్తి చూడలేకుండా వున్నాడు.

పెద్దలు సెలవివ్వడంతోటే పురోహితుడు "అందరికీ అక్షింత లివ్వరా" అని శిష్యుడికి చెప్పి మంత్రాలు ప్రారంభించాడు.

ఇదంతా చూశాటప్పటికి జానకమ్మకి రక్తం వుడుకెత్తిపోయింది. శరసంధానం చేసిన దనుస్సులా వున్న ఆమె కనుబొమ్మలు చూసి యువకుడు కూడా చకితు డయిపోయాడు.

"ను వ్విప్పుడు చేస్తూ వున్న పనేమి టయ్యా యాజులు తాతా?"

"తరవాత మాట్లాడుకుందాం"

"ఆడా ళ్లందరి లాగే నువ్వు కూడా చూస్తూ కూచోరాదుటే జానకీ?"

"అలాగ టయ్యా చయనులు తాతయ్యా! నేను కూడా తెల్లపోయి కూచుంటే మీ రంతా సుందరి మెడకి వురితాడు బిగిద్దా మనుకుంటున్నారేం? ఈ పాటికి

దిగండి గుర్రం. యాజులుతాతా! ఇది తరవాత మాట్లాడుకోవలసిన విషయం కాదు. ఇప్పుడే జవాబు చెప్పాలి నాకు”

“నా కా అవసరం లేదు.

“అయితే వున్నప్పుడే చెబుదువు గానీ లే. తొందర లేదు. దబ్బన్న బాబూ! సుందరి నేంచెయ్య తలచుకున్నా వయ్యా నువ్వా?”

ఇది విని “అమ్మయ్యా! బతికాను.” అని లచ్చమ్మ తెప్పిరిల్లింది. జలసిక్తమైన గ్రీష్మలత లాగ సుందరి ఆశాభరితురాలై తల యెత్తి చూసింది. స్త్రీలంతా స్త్రీశక్తి అంటే యేమిటో మొదటి మాటు చూడగలిగారు. అరచచ్చి పడివున్న వాడిలాగ దబ్బన్న మాట్టాడలేకపోయాడు.

“మాట్టాడ మేమయ్యా!”

“అంతా - సిద్ధ - మయి - పోయింది. ఇప్పుడింకేం చెయ్య - డానికి అవకాశం లేదు”

“జ్ఞానం వుంటే అంతా అవకాశమే. సుందరికి పెళ్ళి చెయ్యవలసిన పూచీ నీకు హెచ్చుగానే వుంది. కాని శవానికి అంటదీసి కట్టిపెట్టడానికి అధికారం లేదు”

“.... ....”

“బాగా ఆలోచించుకో”

“......”

“నీకు తోచకపోతే బుద్ధి కలవాళ్ళని సలహా అడుగు”

“......”

“వూరుకుంటే పనికి రాదు. ఈనాటకం అంతా యీపాటికి కట్టిపెట్టాలి. ఏమంటావ్?”

“మానడానికి వీల్లేదు. నువ్వు దూరంగా వుండు”

“నువ్వా నేనా దూరంగా వుండవలసింది? తొందరపడకు. ఏమమ్మా పిన్ని! నీ కెలా చేతులు వచ్చాయమ్మా చూస్తూ చూస్తూ పిల్ల గొంతు క్కొయ్యడానికీ?”

“వొక్క మోస్తరుగా రాసిరంపాన బెడుతూ వుంటే నన్నేం చెయ్య మంటావు కూతురా?”

“అయితే నువ్వివతలికి వస్తావా రావా!”

“ఇం కే మయినా సరే; నువ్వు నా కాసరా దొరికావు గదా!”

ఇలా అంటూ కాళ్ళు కడుగు చెంబు అక్కడే విడిచిపెట్టేసి లచ్చమ్మ జానకమ్మ దగ్గరికి వచ్చి నుంచుంది.

ఇదంతా చూసి అందరూ మాట్టాడలేకపోయారు: కాని దబ్బన్న మాత్రం అతికష్టంమీద నాలిక స్వాధీనం చేసుకొని “ఇలా వస్తావా రావా!” అని వురిమాడు. దానికి “నేను రా” నంటూ లచ్చమ్మ ఝూంకారంగా జవాబు చెప్పి జానకమ్మకి యింకా దగ్గిరిగా వెళ్ళింది.

"మొండిపీనుగా? ని న్నేం చేస్తానో వోపిక పట్టు, నువ్వు రాకపోతే ఆగిపోతుం దనుకున్నావు కామోసు. నీ రవిక నా మొళ్లో దోపుకొని-"

"సెబాస్! నీవంశప్రతిష్ఠ నిలిపావురా దబ్బనా!

"అలాగ టయ్యా సుబ్బావధానులు ముత్తాతయ్యా? నిలపడూ మరీ దబ్బన్న బాబు మీ రంతా వెనక్కాల తాళం వేస్తూ వుంటేనూ?... పిన్ని రవిక మొళ్లో పెట్టుకుని కన్యాదానం చేస్తా వేం బాబూ నువ్వూ"

"వోక్క దెబ్బని"

"అలా అయితే నువ్వుకూడా లేచి రా సుందరీ"

ఈఆజ్ఞ యింకా పూర్తికాకుండానే నూత్నావేశంతో సుందరి బియ్యబ్బుట్టలో నుంచి దిగింది. అది చూసి యాజులు "అఁ, అఁ" అంటూ చేతులు చాపాడు; గాని యేడుపూ, రోషమూ కలిసిన విలక్షణస్వరంతో "ముసిలిపీనుగా" అని యీసడించి తిట్టి సుందరి వొక్క అంగలో ఆడాళ్లలో పడి జానకమ్మని కౌగలించుకుంది.

శిష్టులంతా మొగమొగాలు చూసుకున్నారు. యాజులు దబ్బన్న కేసి చూడగా అతగాడు మొగం వంచుకున్నాడు. స్త్రీ లంతా నవశక్తి ఆవహించిన వారిలాగ గంభీరముద్ర వహించారు.

ఇటు కన్నెత్తి చూడగా జానకమ్మ వొకచేత్తో మార్కండేయుణ్ణి బుజ్జగిస్తూ వొక చేత్తో శూలం యెత్తి యముడిమీద విసరబోతూ వున్న కాలాగ్ని రుద్రుడు లాగ భయంకరంగా నిప్పులు కక్కుతూ చూస్తూ నుంచుంది.

## 4

భజంత్రీల మంగళవాద్యాలతోటీ, పురోహితుని మంత్రపఠనంతోటీ, శిష్టుల కారషకారాలతోటీ, స్త్రీల సన్నాయినొక్కులతోటీ మహాకోలాహలంగా వుండవలసిన పెళ్ళిపందిరి చీమ రాలితే చిటుక్కు మనేటంత నిశ్శబ్దం అయిపోయింది.

పది నిమిషా లిలా గడిచాక నడుం విరిగిన నల్ల తాచులాగ లేవలేక లేవలేక, లేచి దబ్బన్న గుడి వెనక్కాలకి పోయి ఖూలబడ్డాడు. తరవాత పరాభవఖిన్నుడై పెళ్ళితాత* గూడా వుత్తరద్వారంలో నుంచి బైటికి వెళ్ళి చెరువుగట్టుమీద తులసికోట దగ్గిర చదికిలబడ్డాడు.

ఆ తరవాత పురుషులు కొందరు యాజులు దగ్గిరికీ, కొందరు దబ్బన్న దగ్గిరికీ వెళ్లి చుట్టూ మూగారు.

యాజులు చయనుల్ని దగ్గిర కూచో మని "యేమంఛా" వన్నాడు.

"గట్టి చిక్కే వచ్చింది"

"ఆడదానికి లొంగిపోవలసిందే?"

---

* వయస్సు మళ్ళిన వాణ్ణి 'పెళ్ళికొడుకు' అనడానికి వ్యావహారికాంధ్రభాషావ్యాకరణంలో అనుజ్ఞ లేదు.

"అది ఆడది షోయ్!"

"ఈముండ యెక్కడ దాపరించిం దోయి నా ప్రాణాలకీ? సిద్ధాన్నం - మళ్ళీ అరు మాసాల్లో పెళ్ళా మనీ, యిల్లనీ - అంతా యెంత తల్లకిందులైపోయిందీ?"

"......."

"ఎంత దారుణానికి వొడికట్టిందో చూశావా!"

"ఇంగ్లీషోయ్ ఇంగ్లీషు. అసలు ఆవిద్యలోనే వుంది ఆదారుణం. పైగా ఆడ పీనుగులు కూడా బి. ఏ. లయిపోయాక యిక మనకి గతి యెక్కడయ్యా!"

"పుట్టగతు లుంఛాయా దీనికీ దీనబ్బకీని!"

"మహేంద్రసోమయాజుల మాటెత్తకు. వాడు పింఛన్ పుచ్చుకున్న డిపిటీ కలెక్తరూ. వాడు తలుచుకున్నాడంటే-"

"చంపావు. శారదాబిల్లు కూడా పై కెక్క దీస్తాడో యేమిటో ఆ అప్రాచ్యుడు"

"వివాహం కానిదే మన కేం భయమూ?"

"........."

"........."

"దబ్బున్న యే మంఛాడో?"

"నడుం విరిగిపోయింది"

"లాభం లే దంఛావా?"

"మొత్తానికి కష్టమే"

"వూరుకో మంఛావా!"

"వోపిక పట్టడమే నా సలహా"

"అయితే నా నోటు నాకు పారెయ్య మను"

"అది నిజ మేనా?"

"అసలు పదమూడు వందలు. ఫాయిదా అయిదు వందల చిల్లర. మొత్తం రమారమీ రెండు సంచులు-"

"నాతో చెబితే దీ నబ్బ సమ్మంధం తేకపోదునా?

"వచ్చింది యిం తయింది గదా?"

"......"

"వొక మాటు వెళ్లిరా"

"రెండు రోజులు ఆగలేవూ!"

"ఇక వాడివల్ల కాదు. ఆ దిక్కుమాలిన పిల్ల నా కక్కరలేదు కూడానూ?"

"......."

"కానైతే నలుగురిలోనూ మాట పడిపోతుందని భయపడేనా పెళ్లానికి నచ్చచెప్పుకో లేకపోతాడా అని ఆశగానే వుంది: కాని-"

"ఈసంగతి యిప్పుడే వెల్లడి అయితే జానకి మరింత పురెక్కుతుం దేమో!"

"అయ్యో"

ఈ సమయంలో కంఠం సంవరించుకుంటూ సుబ్బావధాని వచ్చి పక్కని కూర్చున్నాడు.

"ఏ మంఛాడు!"

"ఆడాళ్ల చిక్కు వొదిలించుకో గలిగితే తన అభ్యంతరం యేమీ లేదుష"

"ఏమిటీ?"

"రెండో మాట లేదు"

"వొకమా టిలా తీసుకురా గలవా!"

"తుపాక్కి కూడా అంద డిక వాడు"

## 5

పురుష లిలా కిందా మీదా యి దవుతూ వుండగా అక్కడ స్త్రీ లంతా జానకిని చుట్టవేశారు. "నీమూలాన సుందరి కీ గండం తప్పిందే జానకీ" అంది వెంకటసుబ్బమ్మ. "మనం యిలా యెదురుకుంటూంటే యీ మొగాళ్లేం చెయ్యగలరే!" అంది లక్ష్మీనరసమ్మ కళ్లు తిప్పుకుంటూను. "కాకపోయినా మన వూరు మరీ చెడిపోయిందే. మే మంతా మహామహా చదివేశా మని అవధాన్లవారూ, శాస్త్రులవారూ, సోమయాజులవారూ నానా మాలకూడూ - యాక్కు రారీ! డోకొస్తోందర్రా తలుచుకుంటేనూ" అంది కామశాస్త్రిగారి పార్వతమ్మ "రెండు వేల రూపాయల నోటు మీద పారేశారుషే సోమయాజులుగారూ దబ్బున్న చేతులు విరిచీ! ఆయన కిప్పుడు పెళ్లేమిషర్రా విపరీతపు బుద్ధి కాకపోతేనూ? మంచో చెడ్డో యేదో వుండనే వుంది కదా ఆబోగందానితోటే ఆకాస్తకాలమూ గడిపేస్తే-" అని నీలన్నగారి సీతామహాలక్ష్మి అంటూ వుండగా చాపలాంబ అడ్డు వచ్చి "యిప్పటి కిదీ కాస్త నయమే. వుంచుకున్న దాని మేళం తీసుకువచ్చారు కారు తాతగారు. అందుకు సంతోషించండి" అంది. దానిమీద అందరూ పకపకా నవ్వారు. ఆనవ్వులతో గుడి ఆవరణ అంతా గుమ్మ యిపోయింది.

అప్పుడు పెళ్లితాత కూతురు రామలక్ష్మి సిగ్గుపడుతూ విచారిస్తూ ముందుకు వచ్చి "యిప్పుడీ పెళ్ళేమిటి నాన్నా?" అని నే ననేకవిధాల యేడ్చాను. కష్టసుఖా లన్నీ విప్పి చెప్పాను. ఎంత చెప్పినా ససేమిరా అంటే నే నేం చెయ్యనర్రా? ఇది మానేసి పోనీ పిల్లాణ్ణి పెంచుకో మన్నాను. ముందిది అయితే గాని అదెలా గని నన్ను కొట్టినంత పని చేశాడు మానాన్న. "అయితే మీకర్మం" అని నేను చచ్చినట్టు పడివున్నాను. ఇంత రగడ యెందుకు పెరగాలీ కర్మం కాకపోతేనూ?" అంది కళ్లల్లో కళ్లు పెట్టుకుని. అప్పుడు జానకి అందుకుని యిలా వుపన్యసించింది.

"రామలక్ష్మి మాటలు విన్నారా మీ రంతానూ కాని మొగాళ్లం మన కే మని వీళ్లకి మహా ఆంద్రబ్బ ప్రబలిపోయింది. దీని కంతా కారణం మనమే. మనం భీష్మించుక్కూచుంటే వీ ళ్ళేం చెయ్యగలరూ? మన శక్తి మనం మరిచిపోయాం. మన అధికారం మనం వొదులుకున్నాం. మనకి మనమే చేతులారా బానిసల మైపోయాం. ఆడదాని బతుకు మొగాడి కాలికింద వుంది యిప్పుడు. ఇతరదేశాల్లో ఆడది మొగాడితో సమంగా బతుకుతోంది. మన తెలివితక్కువకి యీ వుదాహరణం చాలదూ? పైగా రామలక్ష్మి వెర్రిబాగులతనం చూడండి. తండ్రి నది యీ పెళ్ళి మానేసి పిల్లాణ్ణి పెంచుకో మందిట. కడుపున పుట్టిన తానుండగా యెక్కణ్ణుంచో వొక అంటు మొక్కని తీసుకురావడం యేమీ? సీమలో కొడుకులు లేని తండ్రి చచ్చిపోతే ఆస్తి అంతా కూతుళ్లకివెడుతుంది. యాజులు తాత లక్షరూపాయల సంసారి. అతని తరవాత యెక్కణ్ణుంచో వచ్చినవా డాసొమ్ము అనుభవించడమూ, కడుపున పుట్టిన రామలక్ష్మి వాణ్ణి ఆశ్రయించి, వాడి పెళ్ళాం యీసడింపులు పడుతూ శవంలాగ బతకడమూనా?... మనలో యిలాంటివి చాలా వున్నాయి. అవన్నీ మీకు రోజూ బోధపరుస్తాను. నేను మనఆడాళ్ల బాగుకోసమే నా జీవితం అంతా గడపాలని నిశ్చయించుకున్నాను. నేను వుద్యోగం చెయ్యను. మా అమ్మా, మా నాన్నగారూ ఇష్టమైతే పెళ్ళాడమంటూనే వున్నారు; గాని యిందుకోసం నేను పెళ్లి మానుకున్నాను. మన వూళ్లో మన ఆడాళ్లంతా యెంతెంత యమచర అనుభవిస్తున్నారో మీ రంతా యెరుగుదురు. అదంతా పోగొడతాను నేను. మీరంతా నాకు సాయం అయితే మీరే సుఖపడతారు."

ఇది విని అందరూ "అవునర్రా" అంటే "అవునర్రా" అన్నారు. నరసింహ చయనులుగారి మూడో పెళ్ళాం వెంకటరత్నమ్మ "మేమంతా రేపు మీ యింటికి వస్తాం. మంచీ చెడ్డా చెప్పమ్మా" అనగా వెంకటశాస్త్రిగారి రెండో పెళ్లాం కృష్ణవేణి "రేపే అన్నమాటేమిటి? పని లేని పుణికింతాలు కల్పించుకుని శ్లేష్మంలో పడ్డ యీగలాగ కొట్టుకోవడమే కాదూ యిళ్లల్లోనూ? రోజూ వెడదాం. మాకు సంగతు లన్నీ చెబుతూ వుండవే కోడలా" అంటూ జానకి చెయ్యిపట్టుకుంది.

"అయితే మరీ మంచిది. మీకందరికీ నేను చదువుకూడా చెబుతాను. మధ్యాహ్నం రెండు మొదలు అయిదింటి దాకా యెవళ్లకీ పను లుండవు. మొగాళ్ళేం అడ్డుపెట్టినా మీరంతా మాయింటికి రావాలి" అని జానకి వారికి ప్రోత్సాహం చేసింది.

అప్పుడు లచ్చమ్మ జానకి రెండుచేతులూ పట్టుకుని "నువ్వీరాత్రి మాయింటో వుండవుటే కూతురా" అని ప్రాధేయపడింది. సుందరి కూడా "రావుటే అక్కయ్యా?" అని జాలిగా అడిగింది. దాని మీద జానకి అతిప్రేమతో సుందరి కణతలమీద మెటికలు విరిచి "మరి నేను చెప్పినట్టల్లా వింటావా యెప్పుడూనూ!" అని అడుగుతూ గభీమని చంకబెట్టుకుని ముందుకి అడుగు వేసింది.

(ప్రభుద్ధాంధ్ర - మే, 1934)